క్లుప్తంగా

మర్యాదపూర్వకంగా...



వింజమూరు(ఉదయగిరి) : వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని తాడేపల్లిలోని నివాసంలో పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు, చాకలికొండ ఎంపీటీసీ సభ్యుడు దేగా వంశీ బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలోని బీసీ వర్గాల్లో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని జగన్‌మోహన్‌రెడ్డి సూచించినట్లుగా వంశీ తెలిపారు.

ఎస్సీ కమిషన్ చైర్మన్‌ను కలిసిన ఆత్మకూరువాసులు

ఆత్మకూరు: ఆంధ్రప్రదేశ్ ఎస్సీ కమిషన్ చైర్మన్ కొత్తపల్లి శ్యామ్యూల్‌ను విజయవాడలోని కార్యాలయంలో ఆత్మకూరుకు చెందిన పలువురు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఎస్సీల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ఆత్మకూరు పోలీసు కానిస్టేబుల్ జేమ్స్, తదితరులు పాల్గొన్నారు.

ఉదయగిరి సీఐకి ప్రశంసాపత్రం



ఉదయగిరి: ఉదయగిరి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వెంకట్రావు ఎస్పీ కృష్ణకాంత్ నుంచి ప్రశంసాపత్రం అందుకున్నారు. నెల్లూరులోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్లో బుధవారం జరిగిన నేర సమీక్ష సమావేశంలో విధి నిర్వహణలో ప్రతిభ కనబర్చిన సీఐ వెంకట్రావుకు ఎస్పీ ప్రశంసాపత్రం అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా సీఐకు ఉదయగిరి సర్కిల్ పరిధిలోని ఎస్సైలు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో బిల్వాభిషేకం



సంగం : సంగంలోని తిరుమనకొండపై ఉన్న కాశీవిశ్వేశ్వరునికి బిల్వాభిషేకాన్ని వేదపండితులు బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పరమేశ్వరుని జన్మనక్షత్రమైన ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని ప్రదోష కాలంలో సకల ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం కాశీవిశ్వేశ్వరుడిని విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు జరిపారు. భక్తులు శివనామస్మరణలతో విశ్వేశ్వరాలయం మార్మోగింది. అనంతరం రాజరాజేశ్వరిదేవికి శ్రీచక్ర నవావరణ, కుంకుమార్చన పూజలు నిర్వహించారు.

విద్యతో ఉన్నత శిఖరాలు

కావలి(జలదంకి): విద్యతో ఉన్నత శిఖరాలను చేరుకోవచ్చని కావలి ఎంఈఓ బీ గోవిందయ్య అన్నారు. కావలి పట్టణంలోని వడ్డిపాళెం మున్సిపల్ ప్రైమరీ పాఠశాలకు పువ్వాడ సత్యానంద జ్ఞాపకార్థంగా ఆయన శిష్యబృందం బీరువా, నోట్ పుస్తకాలు, ఆట వస్తువులను బుధవారం వితరణ చేశారు. ఈ కార్యక్రమానికి ఎంఈఓ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు చిన్నతనం నుంచే ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని అందుకుని తల్లిదండ్రులు, పాఠశాలకు మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు. హెచ్ఎంలు సుబ్బారావు, మహేష్, లోక్‌అదాలత్ సభ్యుడు మాల కొండారెడ్డి, ఉపాధ్యాయులు రవి, ప్రసన్న, తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతులు కల్పించాలని వినతి



సోమశిల: అనంతసాగరం మండలంలోని సచివాలయాల్లో విధులు నిర్వహిస్తున్న ఇంజనీరింగ్ అసిస్టెంట్లు తమకు పదోన్నతి కల్పించాలని కోరుతూ ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్, పీఆర్ ఏఈ శివారెడ్డికి బుధవారం వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమకు ఇన్‌చార్జి బాధ్యతలను అప్పగించి పనిభారం మోపినా విధులను సక్రమంగానే నిర్వహిస్తున్నామన్నారు. ప్రభుత్వం స్పందించి తమపై పనిభారాన్ని తగ్గించి పదోన్నతులు కల్పించాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అల్లూరు: నగర పంచాయతీ పరిధిలో గురు, శుక్రవారాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు అల్లూరు టౌన్ ఏఈ షేక్ మస్తాన్ బుధవారం తెలిపారు. అల్లూరు సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేపడుతున్న దృష్ట్యా ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సరఫరాను నిలిపివేస్తున్నామని చెప్పారు. నగర పంచాయతీ ప్రజలు ముందస్తు ఏర్పాట్లు చేసుకుని సహకరించాలని కోరారు.

మునిగిన దోస రైతులు

- దారుణంగా పతనమైన ధరలు
- కోత ఖర్చులు కూడా రాని వైనం
- పొలాల్లోనే కాయలను వదిలేస్తున్న అన్నదాతలు



తూర్పుబోయమడుగులో వదిలేసిన దోసపంట

ఉదయగిరి: చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అన్నదాతలు ఆరుగాలం శ్రమించిన పంటలకు గిట్టుబాటు ధరలు ఉండడం లేదు. దీంతో పెట్టుబడులు కూడా రాక రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. రైతులను ఆదుకోవాల్సిన ప్రభుత్వం ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టడం లేదు. గత రబీ సీజన్‌లో ధాన్యానికి ధరలు లేక రైతులు నిండా మునిగారు. ప్రస్తుతం కూరగాయలకు సైతం గిట్టుబాటు ధరలు లేకపోవడంతో అల్లాడుతున్నారు. ఉదయగిరి నియోజకవర్గంలోని ఉదయగిరి, వరికుంటపాడు, వింజమూరు, కలిగిరి మండలాల్లో ఈ ఏడాది వేసవిలో దోస పంటను విస్తారంగా సాగు చేశారు. ఎన్నడూ లేని విధంగా దోసకాయల ధరలు దారుణంగా పడిపోయాయి. ప్రస్తుతం మార్కెట్లో 60కేజీల బస్తా ధర రూ.200 నుంచి రూ.250కు మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. దీంతో కనీసం కోత కూలి ఖర్చులు కూడా రాకపోవడంతో రైతులు తోటల్లో కాయలను అలాగే వదిలేస్తున్నారు. గత ప్రభుత్వంలో దోసకాయలు బస్తా రూ.400 నుంచి రూ.1150 వరకు పలికాయి. దీంతో అనేక మంది రైతులు లాభసాటిగా ఉంటుందని భావించి దోస పంట సాగు వైపు మొగ్గు చూపారు. కానీ ఈ ఏడాది ప్రస్తుత సీజన్‌లో ధరలు దారుణంగా పడిపోయాయి. రైతుల వద్ద కిలో రూ.2కు కొనుగోలు చేస్తున్న వ్యాపారులు మార్కెట్లో వినియోగదారులకు రూ.25కు అమ్ముతున్నారు. రైతుల నుంచి కొనుగోలు చేసే ధరకు, మార్కెట్‌లో విక్రయించే ధరలకు ఇంతా వ్యత్యాసం ఉన్నా అధికారులు, ప్రభుత్వం పట్టించుకోకపోవడంపై రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పంటలకు గిట్టుబాటు ధరలు ఉండేలా చర్యలు తీసుకోవాలని అన్నదాతలు కోరుతున్నారు.



దోసకాయల బస్తాలు

దోససాగుతో నష్టపోయా



వేసవిలో బోరు కింద మూడెకరాల్లో దోస పంట సాగు చేపట్టా. తీరా కాయలు కోతకు వచ్చే సరికి ధరలు పడిపోయాయి. వ్యాపారులు బస్తా రూ.250కు కూడా అడగడం లేదు. గతేడాది వేసవిలో బస్తా ధర రూ.800 వరకు పలికింది. కానీ ఈ ఏడాది ధరలు దారుణంగా పడిపోయి నష్టపోయాం.

–ఖాసీం,రైతు, బోయమడుగుల

కోయకుండా వదిలేశాం



దోసకాయల ధరలు దారుణంగా పడిపోయాయి. కనీసం కోత ఖర్చులు కూడా రావడం లేదు. దీంతో కాయలను కోయకుండా వదిలివేశాం. రైతుల వద్ద కిలో రూ.2కు కొనుగోలు చేస్తున్నారు. మార్కెట్లో మాత్రం కిలో రూ.25కు విక్రయిస్తున్నారు. ప్రభుత్వం స్పందించి గిట్టుబాటు ధరలు కల్పించి రైతులను ఆదుకోవాలి.

–చిట్టి బాబు, బోయమడుగుల

ఉపాధి లక్ష్యాలను సాధించాలి



ఉదయగిరి: ఉపాధి సిబ్బందితో సమీక్షిస్తున్న ఎంపీడీఓ అప్పాజీ



సీతారామపురం: ఉపాధి సిబ్బందితో సమీక్షిస్తున్న ఎంపీడీఓ భార్గవిరెడ్డి

ఉదయగిరి: ఉపాధి లక్ష్యాలను సాధించేందుకు ఉపాధి సిబ్బంది కృషి చేయాలని ఎంపీడీఓ అప్పాజీ అన్నారు. స్థానిక స్త్రీశక్తి భవనంలో ఉపాధి పనుల పురోగతిపై బుధవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని పంచాయతీల్లో ఉపాధి పనులకు హాజరయ్యే కూలీల సంఖ్యను పెంచాలన్నారు. జాబ్‌కార్డు కలిగిన ప్రతిఒక్కరికి ఉపాధి పని కల్పించాలన్నారు. ఉద్యాన పంటలకు సంబంధించిన ప్రతిపాదనలు తయారుచేయాలన్నారు. పనుల వద్ద కూలీలకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలన్నారు. కూలీలకు కొలతలు కేటాయించి ఆ మేరకు పనులు చేయించాలన్నారు. మస్టర్లను పక్కాగా నమోదుచేయాలన్నారు. ఈ సమావేశంలో ఈసీ తిరుపతిరావు, ఫీల్డ్‌అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల సంఖ్యను పెంచాలి

సీతారామపురం : ఉపాధి హామీ పనులకు హాజరయ్యే కూలీల సంఖ్యను గణనీయంగా పెంచాలని ఎంపీడీఓ భార్గవిరెడ్డి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి పనుల పురోగతితో బుధవారం ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూలీలకు కొలతలను కేటాయించి ఆ ప్రకారం పనులు చేపట్టేలా చూసి గిట్టుబాటు వేతనాలు అందేలా చూడాలన్నారు. గ్రామాల్లో అవసరమైన పనులను గుర్తించి కూలీలకు పని దినాలు కల్పించాలన్నారు. ఉద్యాన పంటల సాగుపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఏపీఓ శ్యామల, ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సంక్షేమమే ఏపీటీఎఫ్ లక్ష్యం



వాశిలిలో సభ్యత్వాన్ని అందజేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

ఆత్మకూరు, ఆత్మకూరురూరల్: ఉపాధ్యాయుల సంక్షేమమే ఏపీటీఎఫ్ లక్ష్యమని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు అల్లంపాటి సురేంద్రరెడ్డి పేర్కొన్నారు. ఆత్మకూరు పట్టణంతో పాటు మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఏపీటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఉపాధ్యాయులకు సంబంధించిన పీఆర్సీని అమలు చేయాలని, పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. సంఘ నాయకులు వెంకటేశ్వర్లు రెడ్డి, వెంగయ్య, సురేష్, రామసుబ్బారెడ్డి, శివకుమార్‌రెడ్డి, శ్రీనివాసులు, తిరుపతిరెడ్డి, షాజిద్, తదితరులు పాల్గొన్నారు.

రేషన్ పంపిణీలో అవకతవకలకు పాల్పడితే చర్యలు



రేషన్ డీలర్లతో మాట్లాడుతున్న తహసీల్దార్

జలదంకి: రేషన్ పంపిణీలో అవకతవకలకు పాల్పడితే డీలర్లపై చర్యలు తప్పవని తహసీల్దార్ ప్రమీల హెచ్చరించారు. బుధవారం ఆమె తన కార్యాలయంలో రేషన్‌డీలర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. డీలర్లు తమకు నిర్దేశించిన సమయంలో చౌకదుకాణాల్లో అందుబాటులో ఉండి లబ్ధిదారులకు సరుకులను సక్రమంగా పంపిణీ చేయాలన్నారు. దివ్యాంగులు, వృద్ధులకు ఇళ్ల వద్దకు వెళ్లి సరుకులు అందించాలని సూచించారు. ఇటీవల డీలర్లు రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తూ పట్టుబడితే డీలర్లపై కేసులు నమోదు చేయడంతో పాటు డీలర్‌షిప్‌ను తొలగిస్తామని హెచ్చరించారు. డీటీ జులీబాయి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడి మృతికి సంతాపం

ఉదయగిరి రూరల్: పట్టణంలోని అగ్రహారం వీధికి చెందిన విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు ఎండీ ఉస్మాన్‌అలీ(84)గుండెపోటుతో బుధవారం మృతి చెందారు. ఆయన మృతిపై విశ్రాంత ఉపాధ్యాయుల సంఘం ఉదయగిరి తాలుకా అధ్యక్ష, కార్యదర్శులు ఖాదర్‌బాషా, అబ్దుల్‌రషీద్, ఏపీ ఉపాధ్యాయ సమాఖ్య జిల్లా మండల నాయకులు ఎండీ ఖాజా, షబ్బీర్, ఉదయగిరి ఖాదరీయ ఆస్తానా అధ్యక్షుడు అహ్మద్‌బాషాఖాలీద్, ఉదయగిరి అభివృద్ధి ఫోరం అధ్యక్షుడు వీ రామచంద్రమూర్తి తదితరులు ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడిగా సుదీర్ఘకాలం పనిచేసిన ఉస్మాన్‌అలీ ఎంతోమందిని క్రీడాకారులుగా తీర్చిదిద్దారని చెప్పారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

గర్భిణులు పోషకాహారం తీసుకోవాలి

కావలి (జలదంకి): తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉండాలంటే గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని కావలిలోని వైకుంఠపురం అర్బన్ హెల్త్‌సెంటర్ వైద్యాధికారిణి మేఘనాచౌదరి అన్నారు. వైకుంఠపురం యూహెచ్‌సీ ఆధ్వర్యంలో డాక్టర్ రామ్‌సెంటర్ సహకారంతో పెంకుల ఫ్యాక్టరీ గిరిజనకాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు పోషకాహారంపై అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. గర్భిణులకు తక్కువ ఖర్చుతో లభ్యమయ్యే పోషకాహారంపై అవగాహన కల్పించారు. అనంతరం డాక్టర్ రామ్‌సెంటర్ నిర్వాహకులు గర్భిణులకు ఐరన్, ఫోలిక్, కాల్షియం సిరప్‌లను అందించారు. రామ్ సెంటర్ చైర్మన్ దొడ్ల మనోహర్‌రెడ్డి, డైరెక్టర్ కూనం తాతిరెడ్డి, సామాజిక కార్యకర్త మాలకొండారెడ్డి, యూహెచ్‌సీ కమ్యూనిటీ ఆర్గనైజర్లు చెన్నకేశవులు, సనీత, రత్నకుమారి, ఆశాకార్యకర్త మోహిన్, అంగన్‌వాడీకార్యకర్త శారద, తదితరులు పాల్గొన్నారు.

అంకమ్మకు విశేష పూజలు

చేజర్ల(ఆత్మకూరు): చేజర్లలో గ్రామదేవత అంకమ్మకు బుధవారం రాత్రి విశేష పూజలు నిర్వహించారు. మహిళలు పొంగళ్లు పెట్టి నైవేద్యాలు సమర్పించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదాన్ని వితరణ చేశారు. ఉభయకర్తలుగా బొగ్గవరపు సుధాకర్, దేవతి సుబ్బారావు, రమేష్‌బాబు, సుజనారెడ్డి, కమలేష్, తేజ, తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం

కావలి (జలదంకి): కావలిలోని సంయుక్త సేవా సంస్థలోని పేద విద్యార్థులకు నెల్లూరులో ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న ఒట్టూరు శ్రీనివాసులు, నీరజ దంపతులు బుధవారం అన్నదానం చేశారు. తమ మనవడు లిషాన్‌రామ్ తృతీయ జన్మదినాన్ని పురస్కరించుకుని పేద విద్యార్థుల నడుమ కేక్ కట్ చేసి పంచి పెట్టారు. అనంతరం విందు భోజనం అందించారు. సేవా సంస్థ అధ్యక్షుడు సురేంద్ర, రత్నమ్మ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ ఎంవీఎస్ ప్రసాద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి మహిళా సర్పంచ్‌లకు శిక్షణ తరగతులు

ఆత్మకూరురూరల్: మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 26 నుంచి 28వ తేదీ వరకు మహిళా సర్పంచ్‌లకు శిక్షణ తరగతులను నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ బుధవారం తెలిపారు. స్థానిక స్వపరిపాలనలో మహిళా సాధికారత, గ్రామీణాభివృద్ధి దిశగా మార్పు అనే అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. మండలంలోని మహిళా సర్పంచ్‌లందరూ హాజరుకావాలని కోరారు.

ఉరేసుకుని వృద్ధుడి ఆత్మహత్య

సంగం: మండలంలోని తరుణవాయిలో వృద్ధుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన కే జగన్నాథం(70) కొంతకాలంగా ఒంటరిగా ఉంటున్నాడు. ఏం జరిగిందో ఏమో తెలియదు బుధవారం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇంట్లో నుంచి వృద్ధుడు బయటకు రాకపోవడాన్ని గమనించిన స్థానికులు వెళ్లి చూడగా ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. దీంతో కుటుంబ సభ్యులకు సమాచారం అందజేశారు. కాగా ఈ ఘటనపై పోలీసులకు ఎలాంటి సమాచారం లేదు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు



ఘటనా స్థలంలో క్షతగాత్రుడు

సంగం: మోటార్‌సైకిల్‌ను క్యాంపర్ వాహనం ఢీకొని వ్యక్తి తీవ్రంగా గాయపడిన ఘటన దువ్వూరు వద్ద నెల్లూరు–ముంబై జాతీయ రహదారిపై బుధవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు..సిద్దీపురానికి చెందిన సాంబయ్య మోటార్‌సైకిల్‌పై బుచ్చిరెడ్డిపాళెం వెళ్లి తిరిగి వస్తున్నాడు. ఈ క్రమంలో దువ్వూరులో కూల్‌డ్రింక్స్ దించి వస్తున్న క్యాంపర్ వాహనం ఎదురుగా ఢీకొంది. దీంతో సాంబయ్య తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడ్ని 108 వాహనంలో నెల్లూరుకు తరలించారు. ప్రమాదానికి కారణమైన వాహనాన్ని సంగం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రక్తదానంపై అవగాహన కల్పిస్తూ..



సైకిల్‌పై యాత్ర చేస్తున్న సాయిరామ్

ఆత్మకూరు: రెడ్‌క్రాస్ సొసైటీ మోటివేటర్ సాయిరామ్ రక్తదానంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు జిల్లా వ్యాప్తంగా పర్యటిస్తున్నారు. కావలికి చెందిన ఆయన 49 రోజులుగా సైకిల్‌పై తిరుగుతూ ప్రచారం చేస్తున్నారు. 60 సంవత్సరాలపైన వయసున్న సాయిరామ్ తన యాత్రలో భాగంగా బుధవారం ఆత్మకూరుకు విచ్చేశారు. జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి వద్ద, నెల్లూరుపాళెం సెంటర్‌లో ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మే 8న రెడ్‌క్రాస్ దినోత్సవం సందర్భంగా జిల్లాలో సైకిల్ యాత్ర ప్రారంభించినట్లు తెలిపారు. ఆరోగ్యవంతమైన వ్యక్తి ఏడాదిలో మూడుసార్లు నిరభ్యంతరంగా రక్తదానం చేయొచ్చన్నారు. యాత్రతో ఉదయగిరికి సాగుతున్నట్లు ఆయన పేర్కొన్నారు.

రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించాలి



సీతారామపురం: మామిడి తోటను పరిశీలిస్తున్న ఏఓ చెన్నారెడ్డి

చేజర్ల(ఆత్మకూరు): రెండోకారు పంట సాగు చేస్తున్న రైతులు రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించాలని ఏఓ హిమబిందు సూచించారు. మండలంలోని చిత్తలూరు, ఆదూరుపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు.ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ రైతులకు ఎడగారు సాగుపై సూచనలు చేశారు. రసాయన ఎరువులను అధికంగా వినియోగించడం వల్ల తెగుళ్లు సోకి పంట దిగుబడులు తగ్గిపోతాయని తెలిపారు. రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించుకునేందుకు పచ్చిరొట్ట పైర్లను సాగుచేసి భూమిలో కలయదున్నుకోవాలని సూచించారు. వ్యవసాయశాఖ సిబ్బంది సుజాత, మాధురి, కిరణ్, రైతులు పాల్గొన్నారు.

సీతారామపురం : మండలంలోని నెమళ్లదిన్నెలో వ్యవసాయాధికారి చెన్నారెడ్డి ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఖరీఫ్ పంట సాగులో పచ్చిరొట్ట పైర్ల ఆవశ్యకత, ఎరువుల యాజమాన్యం, కలుపు, తెగుళ్ల నివారణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం మామిడితోటను పరిశీలించి తెగుళ్ల నివారణ చర్యలను సూచించారు. సర్పంచ్ రామచంద్ర, ఏఈఓ సుధీర్ కుమార్, వీఏఏ లక్ష్మీనారాయణ, రైతులు పాల్గొన్నారు.

పాడిరైతులకు అందుబాటులో ఉండాలి



మాట్లాడుతున్న ఉపసంచాలకులు మల్లారెడ్డి

ఉదయగిరి: పాడి రైతులకు పశుసంవర్ధక శాఖ సిబ్బంది క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించాలని కావలి డివిజన్ పశుసంవర్ధక శాఖ ఉపసంచాలకులు ఎస్ మల్లారెడ్డి అన్నారు. పట్టణంలోని బిట్–1 రైతుసేవా కేంద్రంలో పశువైద్యాధికారులు, సిబ్బందితో బుధవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విలేజ్ వెటర్నరీ అసిస్టెంట్లు గ్రామసచివాలయాల్లో పాడిరైతులకు అందుబాటులో ఉండాలన్నారు. నిర్దేశించిన లక్ష్యాలను నూరు శాతం సాధించాలన్నారు. పశువులు, జీవాలకు సీజనల్ వ్యాధులు సోకకుండా ముందస్తుగా వ్యాధి నిరోధక టీకాలు వేయాలన్నారు. పశుదాణాను పాడి రైతులకు సక్రమంగా అందజేయాలన్నారు. జూలై 10వ తేదీ వరకు చేపట్టే నట్టల నివారణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. అనంతరం బదిలీపై వెళ్లిన, బదిలీపై వచ్చిన సిబ్బందిని సన్మానించారు. ఈ సమావేశంలో ఉదయగిరి, మర్రిపాడు మండలాల ఏడీహెచ్‌ఏలు శశిధర్, జయచంద్రారెడ్డి, వైద్యాధికారులు రాఘవేంద్ర శర్మ, వినయ్, సిబ్బంది పాల్గొన్నారు.

మార్చిలోగా గృహ నిర్మాణాలను పూర్తిచేయాలి



గృహ నిర్మాణాలను పరిశీలిస్తున్న హౌసింగ్ పీడీ వేణుగోపాల్

సంగం: పీఎంఏవై–1 కింద జిల్లాలో మంజూరైన గృహాలను వచ్చే మార్చిలోగా లబ్ధిదారులు ప్రారంభించి పూర్తి చేసుకోవాలని గృహ నిర్మాణశాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ వేణుగోపాల్ సూచించారు. సంగం చెక్‌పోస్టు సెంటర్ సమీపంలో ఉన్న హౌసింగ్ లేఅవుట్‌ను ఆయన బుధవారం పరిశీలించారు. లబ్ధిదారులు గృహ నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసుకునేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ జిల్లాలో 1.04 లక్షల గృహాలు మంజూరయ్యాయని, వీటిలో సుమారు 30 వేల ఇళ్లు పూర్తయ్యాయన్నారు. 22 వేల వరకు ఇళ్ల నిర్మాణాలు ప్రారంభం కాలేదని తెలిపారు. జిల్లాలో 160 మంది కాంట్రాక్టర్ల ద్వారా ఆప్షన్–3 కింద 22 వేలకు పైగా గృహ నిర్మాణాలు జరిగాయని, ఇందులో ఏడు వేల గృహాలు పూర్తి కావచ్చాయని తెలిపారు. కాంట్రాక్టర్లు నిర్మిస్తున్న గృహ నిర్మాణాలపై ఫిర్యాదులు అందడంతో రాష్ట్ర ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశాలిచ్చిందని, విచారణ పూర్తయి నివేదికలు ప్రభుత్వానికి సమర్పించామన్నారు. ఆప్షన్–3 గృహ నిర్మాణాలు 10 నెలలుగా నిలిచిపోయి ఉన్నాయని, కాంట్రాక్టర్లు నిర్మించిన గృహాలను పరిశీలించి 65 మంది కాంట్రాక్టర్లు గృహ నిర్మాణాల పూర్తి చేసేందుకు ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపినట్లు తెలిపారు. ఆయన వెంట గృహ నిర్మాణశాఖ ఏఈ గౌస్‌మొహిద్దీన్, సిబ్బంది ఉన్నారు.

ట్రిపుల్ ఐటీకి విద్యార్థుల ఎంపిక



ఉదయగిరి: అక్షితకు బహుమతి అందజేస్తున్న హెచ్‌ఎం

మర్రిపాడు: మండలానికి చెందిన ఆరుగురు విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు మండల విద్యాశాఖ అధికారులు జ్యోతి, ధనలక్ష్మి తెలిపారు. పదోతరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన నందవరం ఆదర్శ పాఠశాలకు చెందిన మహిత నూజివీడు, లహరి, రమ్య, వెంకటమనోహర్, యశ్వంత్‌లు ఇడుపులపాయ, కదిరినాయడుపల్లి ఉన్నత పాఠశాల చెందిన శృతి ఒంగోలు క్యాంపస్‌లకు ఎంపికయ్యారని వివరించారు. కాగా నందవరం ఆదర్శపాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపిక కావడంపై ప్రిన్సిపల్ లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయ సిబ్బంది అభినందనలు తెలిపారు. కదిరినాయడుపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థిని శృతినికి హెచ్‌ఎం రవీంద్ర, ఉపాధ్యాయులు, పాఠశాల అభివృద్ధికి సహకారం అందిస్తున్న ప్రవాస భారతీయులు ఓబుల్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, కేశవరెడ్డి అభినందనలు తెలిపారు.

సంగం : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినులు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. పదోతరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన జీ స్వర్ణ భారతి నూజివీడు, ఆర్ సోఫియా ఆర్‌కే వ్యాలీ, జీ సుప్రజ ఒంగోలు క్యాంపస్‌కు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రధానోపాధ్యాయుడు బుజ్జయ్య అభినందించారు.

ఉదయగిరి రూరల్: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినులు ఎం అక్షిత, షేక్ తస్లీమ్‌ఫిజా ట్రిపుల్‌ఐటీకు ఎంపికవడంపై ఉపాధ్యాయ సిబ్బంది బుధవారం ఘనంగా సన్మానించి బహుమతులు అందజేసి అభినందించారు. అనంతరం పాఠశాల నుంచి బదిలీపై వెళ్లిన హెచ్‌ఎం బాలకేశవులు, ఉపాధ్యాయులు మోహన్‌రావు, కరుణాకర్, సురేష్ కుమార్‌ను, నూతన ఉపాధ్యాయులు విజయకుమారి, రాజ్యలక్ష్మి, నరేష్, విజయ, స్వాతి, జమీలాబేగాన్ని సన్మానించారు. హెచ్‌ఎం షరీఫ్, సీఆర్పీ ఇనయతుల్లా, సిబ్బంది పాల్గొన్నారు.

ఎమర్జెన్సీ వ్యతిరేక దినోత్సవం

కావలి (జలదంకి): కావలిలో బీజేపీ ఆధ్వర్యంలో ఎమర్జెన్సీ వ్యతిరేక దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. నెల్లూరు ఆర్టీసీ జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. దివంగత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ 1975 జూన్ 25వ తేదీన ప్రజాస్వామ్యాన్ని రద్దు చేసి ఎమర్జెన్సీని ప్రకటించి నియంతలా వ్యవహరించారన్నారు.బీజేపీ నేతలు గుండ్లపల్లి భరత్‌కుమార్, అంజిపాక కమల, కుట్టుబోయిన బ్రహ్మానందం, కుందుకూరి సత్యనారాయణ, సీవీసీ సత్యం, మందా కిరణ్, పరుసు వెంకటేశ్వర్లు, మురళీకృష్ణ, గుత్తా అశోక్‌నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

బ్రిడ్జిపై పేరుకుపోయిన ఇసుక తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..



ఆత్మకూరురూరల్: మండలంలోని ఆత్మకూరు–సోమశిల మార్గంలో దేపూరు వద్ద ఉన్న బొగ్గేరు వంతెనపై పేరుకుపోయిన ఇసుక, ఇతర వ్యర్థాలను పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ శాఖల అధికారులు ఎట్టకేలకు తొలగించారు. బొగ్గేరు వంతెన నాణ్యత లోపంతో దెబ్బతినడంతో పాటు ఇసుక, ఇతర వ్యర్థాలు పేరుకుపోయి ప్రయాణికులు ఇబ్బందులు పడుతుండడంపై ఇటీవల 'సాక్షి'లో కథనం రావడంతో అధికారులు స్పందించారు. వంతెనకు ఇరువైపులా పేరుకుపోయిన ఇసుక, ఇతర వ్యర్థాలను తొలగించారు. దీంతో ఆత్మకూరకు–సోమశిల మార్గంలో ప్రయాణించే సుమారు 40 గ్రామాల ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.